# గంభీరం గెడ్డ

బలిజేపల్లి రాఘవరావు

రైలింజను కూతలాంటి కేకతో నిద్రా భంగమైన విశ్వనాథం ఉలిక్కిపడి లేచి, చుట్టూ చేసేడు. ఎదురుగా తలారి రామప్పడు దండధరుడై, యమకింక రుడిలా కనిపించి అరుస్తున్నాడు.

**''ఆ నిద్ర చాలు! ఇంక లెగండి..''**

సగం నిద్ర తీరక, ఆవలిస్తూ అడిగేడు. ''ఎందుకలా అరుస్తావ్? అవతలేం కొంపలంటుకున్నాయని?''


''మీరు బేగిరండి..నిజంగానే కొంపలంటుకుంటున్నాయక్కడ..'' విశ్వనాథం నిద్ర వదిలి పోయి, కొంపలుకాలితే రాబోయే రాబడిని లెక్కలేసుకుంటూ ''ఎక్కడ్రా! బేగి సెప్పు..''

''కొంపలంటే మీదీ నాదీను!.. అదేదో ప్రాజెక్టుట.. మీరు నెగండి.''అప్పటికి విశ్వనాథానికి మత్తు వదిలి, '' ఏం ప్రాజెక్టురా? ఎవరొచ్చారు? మండలాఫీసరా? యింజనీరా? యెక్కడ?'' అని ఆరాతీసేడు.

''అదేనండీ! మన కొత్త కాలనీకాడ.. బోర్డెట్టేసినారు కూడా!''

''బోర్డెట్టీసినాడా? ఎవడ్రా?..మనకిసెప్పనేదే?!''

''అదేనండి– మన కంట్రాక్టరు రాజుగారి మనిషండి! వర



దరాజులు...దగ్గరుండి కట్టించేత్తన్నాడండి.. మీరు నెగండి..'' అని తొందరపెట్టేడు.

''నువ్వు ముందు పద..'' – అని రామప్పడిని పంపించి, లోనికెళ్ళి, చొక్కాతొడుక్కుని, డొక్కు సైకిలు తీసి బయల్దేరేడు. విలేజ్ సెక్రెటరీ విశ్వనాథం!

డొక్కు సైకిలు ముక్కుతూ మూల్గుతూ కొత్త కాలనీకి చేరేసరికి, అక్కడ గోడ కట్టడం, బోర్డు పెట్టటడం జరిగిపోయాయి. అంతవరకూ హోండా బండి మీద కూర్చొని, ఆడ కూలీలతో కుళ్ళు జోకు లేస్తున్న వరదరాజులు వర్క్ ఇన్‌స్పెక్టరు విశ్వనాథాన్ని చూస్తూనే మరింత నవ్వుతూ ''రండి సెక్రెటరీగారూ! దయచెయ్యండి'' అంటూ మర్యాద చేసేడు.

పరిసరాల్ని పరీక్షగా చూస్తూ అతన్ని సమీపించిన విశ్వనాథం

''యేటిదంతా వరాదా!'' అని అడిగేడు.

''అదేనయ్యా! ఆ బోర్డు చూడు. ఇక్కడ ప్రాజెక్టు వుండేది!''

''ఇక్కడా! ప్రాజెక్టా? ఏది? ఎక్కడ?'' అని ఆశ్చర్యంగా అడిగేడు విశ్వనాథం.

''అదేనయ్యా. నువ్వురాకముందు. ఇక్కడే గంభీరం గెడ్డ ప్రాజెక్టు వుండేదిట.''

''మరేది? ఏమైంది దానికి?''

''పోయిన పెద్ద బగాదికి గెడ్డ సైడు మార్చి అటేపుపోయింది! ఇటేపంతా యిసక మేట సడి ప్రాజెక్టు కప్పడిపోయింది. మీ రెవిన్యూవాళ్ళు ఈ యిసక మేటని పోరం బోకుగా నమోదు చేసి కోలనీ కింద మార్చేసేరు.''

కొంతసేపు ఏదో ఆలోచిస్తూ వూరుకున్న విశ్వనాథం తిరిగి ఆరా తీస్తూ అడిగేడు. ''మరి ఇన్నాళ్ళూ వూరొకొని యిప్పుడిలా బోర్డు పెట్టేదేంటి?''

''ఎందుకంటే యిన్‌స్పెక్షనుంది. కొత్తగా వచ్చిన మా ఎ.యి. గారు రూల్సు మనిషి! గొప్ప స్ట్రిక్టు. ఆయనగారి కోసం యిదంతా.''

''మరి గంభీరంగెడ్డ అని రాసేరు కదా! అది లేదే? కనీసం కాలవైనా లేదే! మరి దానికేం జేస్తారుట?''

''ఏదో వొకటి సెయ్యాల! కాలవ తవ్వాలంటాడు మా గురుడు! ఏటవుద్దో సూడాలి!''

ఈ సంభాషణ జరుగుతూ వుంటే, కోలనీలోని ఛోటా నాయకులు కొందరు అక్కడికిచేరేరు. ఈ సంభాషణ విన్న వాళ్ళకి, కోలనీకి నష్టం వస్తుందేమోనన్న అనుమానం కలిగి అన్నారు.

''ఇదేంటండి! కొంపదీసి మా వాళ్ళకేం గాలి రాదు కదా!''

''ఏమో! యెవరేం చెప్పగలరు? ఎందుకైనా మంచిది. మీరంతా ఒక మాట అనుకోండి. ఆఫీసుకెళ్ళి నేను సంగతి, సందర్భాలు కనుక్కొని వస్తాను'' అనేసి డొక్కుసైకిలిని తోసుకుంటూ మండల రెవిన్యూ ఆఫీసుకేసి పోయేడు విశ్వనాథం.

విశ్వనాథం చెప్పిన వార్త వినగానే ఎమ్మార్వో ఆఫీసులో అగ్గి ముట్టుకుంది. తలొక మాటా వారి అభిప్రాయంగా చెప్పేరు. పైకి గంభీరంగా కనిపిస్తున్నా ఎమ్మార్వోగారికి గుబులు మొదలైంది. మండల సర్వేయర్ని పిల్చి, గత పది, పదిహేనేళ్ళ క్రిందట రికార్డులన్నీ వెదికి విషయాన్ని తెలియజేయమని, రహస్యంగా సందేశాన్నిచ్చేడు. దీని వల్ల యెవరికెంత లాభాస్తుందో అంచనాలు వేసుకోవడంలో మరి కొందరు మునిగిపోయేరు. ఆఖరికి కలెక్టరుగారితో యీ విషయం మాట్లాడ్డవే మంచిదని అంతా తీర్మానించేరు.

ఇక్కడి పరిస్థితి యిలా వుంటే, ఇంజనీరింగు ఆఫీసులో పరిస్థితి మరోలా వుంది. వొస్తాడనుకున్న ఎ.యి.గారు రావడం, అక్కడి పరిస్థితిని చూసి, ఆ కోలనీ వాసులతో మాట్లాడి, అంతా, అవగాహన చేసుకోడం జరిగిపోయింది. ఆయన తన అభిప్రాయాలతో కూడిన నివేదికను రహస్యంగా జిల్లా అధికారులకి అందజేసేడు.

ఆ నివేదిక చూసిన జిల్లా ముఖ్య ఇంజనీరుగారికి చెమటలు పట్టేయి. వెంటనే ఎ.యి.గారిని ఇంటికి రప్పించుకొని, అతనితో రహస్య మంతనాలు చేసి వివరాలు రాబట్టేడు. అక్కడ బోర్డు తప్ప తనకి మరేదీ కనిపించలేదని, ప్రాజెక్టు స్థలంలో ఇప్పుడొక కొలనీ వుందని, చెప్పేడు. అంతేగాకుండా అక్కడ పనిచేసి, ఆ కాలనీవాసుల్ని కదిలిస్తే ఆందోళన లేచేలా వుందని కూడా చెప్పేడు. అంతా విన్న చీఫ్ ఇంజనీరు ఆలోచించి, ''ఈ విషయాన్ని యెక్కడా, యెవరితోనూ అనకండి. ఈ రహస్యాన్ని బయట పెట్టకండి. ఆ కంట్రాక్టరుని పట్టుకొని నిలదీస్తే మరి కొన్ని విషయాలు తెలుస్తాయి. మీరు నోరు జారకండి.'' అని హెచ్చరించి, పంపించేసేడు.

ఎ.యి.గారు వచ్చి, వెళ్ళిన తరువాత, గంభీరం గెడ్డ కాలనీలో ఆందోళన మొదలై పెరిగిపోయింది. ఛోటా నాయకులు సమావేశాలు పెట్టి, కాలనీని కదపవద్దని తీర్మానాలు చేసి, ఎమ్మార్వో గారికి, కలెక్టరు గారికి పంపించేరు. మరికొందరు నాయకులు మరి కాస్త ముందుకెళ్ళి ర్యాలీలు, రాస్తారోకోలు జరిపిస్తామని నోటీసులిచ్చి, బెదిరించారు. అసలు యీ ఆందోళనకు కారణం యేమిటో రెవిన్యూ వారికి అర్థం కాలేదు. కలెక్టరుగారు చీఫ్ ఇంజనీరు గార్ని పిలిచి మాట్లేడేరు.

అప్పుడు మొదలైంది అసలు కథ. ఇంజనీరు గారు కాంట్రాక్టరుగారికి కబురు చేసేడు. అతన్ని తన ఛాంబర్లో కూచోబెట్టి ఎవర్నీ లోనికి రానివ్వద్దని ఆజ్ఞలు జారీ చేసి, మొదలెట్టేడు.

''ఏమయ్యా! కామరాజూ! ఈ గంభీరంగెడ్డ కాంట్రాక్టు నీదే కదూ!''

''చిత్తం! తమకు తెలియందేముంది?''

''అక్కడ అసలు బ్రిడ్జిగాని, గెడ్డగాని, ప్రాజెక్టుగాని లేదంటున్నాడయ్యా మా ఎయి గారు.''

**''అసలు ఈ చిక్కంతా ఆయన గారి వల్లే వచ్చిందయ్యా. అందర్లాగే ఆయనకూడా వాటా తీసుకుని వెళ్తే ఇది జరిగేది కాదండి. ఇది యివాళ్టిది కాదు గదండీ. గడచిన పాతికేళ్ళనించి జరుగుతున్నది. బ్రిడ్జి రిపేరుకి సొమ్ము మంజూరు చెయ్యడం, ఖర్చు చెయ్యడం..అదే మరి మీకు తెలియందేముందండి?''**

''అసలు ఈ చిక్కంతా ఆయనగారి వల్లే వచ్చిందయ్యా. అందర్లాగే ఆయనకూడా వాటా తీసుకుని వెళ్తే ఇది జరిగేది కాదండి. ఇది యివాళ్టిది కాదు గదండీ. గడచిన పాతికేళ్ళనించి జరుగుతున్నది. బ్రిడ్జి రిపేరుకి సొమ్ము మంజూరు చెయ్యడం, ఖర్చు చెయ్యడం..అదే మరి మీకు తెలియందేముందండి?''

''సరేనయ్యా! ఈయన వెళ్ళి అక్కడ గెడ్డ లేదు, బ్రిడ్జికూడా లేదు. లేని బ్రిడ్జికి మరమ్మత్తులేమిటని రిపోర్టు రాసేడు కదయ్యా. మరెలా? కలెక్టరుగారు కూడా దీన్నెలాగో మూసెయ్యమని చెప్పేరు.''

కొంత సేపు మౌనంగా వూరుకున్న కంట్రాక్టరు కామరాజు అద్భుతమైన ఐడియా యిచ్చేడు. ''అయ్యా! ఇది మరి జరిగేది కాదుగాని, ఒక పని చెయ్యండి. ఆ బ్రిడ్జిని పడగొట్టడానికి యాభైవేలే మంజూరు చేసి, ఆపని నాకిప్పించండి. గడిచిన విషయాలు పైకిపొక్కవు. మున్ముందిలాంటివి మరి జరగవు. మూడో కంటికి తెలియకుండా పని జరిపించేస్తాను. ఆపైన మీ యిష్టం.''

ఇంజనీరుగారికి మొదట మతిపోయింది. ''లేని బ్రిడ్జిని పడగొట్టడానికి కంట్రాక్టా!''

''మరి లేని బ్రిడ్జికి మరమ్మత్తులు చేయిస్తున్నారుగదండీ యింత వరకు మరి మీ హయాంలో కూడా...''

''సరేలే. ఇదేదో బాగానే వుంది. ఆ పనేదో చూడు ముందు..''

''మరి– వర్కార్డరూ అదీ..''

''నువ్వెళ్ళవయ్యా! ఎడ్వాన్సు తీసుకున్నావ్ కదా రిపేరుకి– ఫైనల్ పేమెంటు యిస్తాలే.. ఈలోగా అన్నీ పూర్తి చేయించు.'' అన్నారు ఇంజనీరుగారు. కంట్రాక్టరు గారు ధిలాసాగా బైటకి వెళ్ళిపోయాడు. పాపం? ఎయిగారు మాత్రం వెళ్ళిపోయారు. బదిలీ మీద.

మూడోనాడు ఎమ్మార్వో, ఇంజనీరుగారి సమక్షంలో కలెక్టరుగారొక ప్రకటన జారీ చేసేరు. ''ప్రజల ఆందోళనను అర్థం చేసుకుని, కోలనీ వాసుల కోరిక మేరకు గంభీరంగెడ్డ పనులను ప్రభుత్వం విరమించుకొంది.'' అని దాని సారాంశం!

మర్నాడు స్కూల్‌కి వెళ్తున్న పిల్లలు గంభీరం గెడ్డ బోర్డుని చూసి మాస్టార్ని అడిగేడు. ''మాస్టారూ! ఇంతకీ యీ గంభీరం గెడ్డ యెక్కడుందండీ?'' అని.

''బోర్డు చూస్తున్నారు కాదా! అక్కడే! అలాగే వుందది.'' అని చెప్పారు మాస్టారు సమాధానంగా.

★